క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళమిస్తున్న జగన్నాథం

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో శాశ్వత నిత్యాన్నదాన పథకానికి నగరానికి చెందిన వి.జగన్నాథం రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ మేరకు మంగళవారం విరాళ నగదును ఆలయ సిబ్బంది బి.ఎస్. చక్రవర్తికి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విజయగణపతికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో విజయగణపతి ఆలయంలో మంగళవారం పుష్యమాస మంగళవారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మల ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

10 నుంచి రాజశ్యామల నవరాత్రులు



రాజశ్యామలదేవి

శ్రీకాకుళం కల్చరల్ : బలగ నాగావళి తీరంలోని బాలాత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో ఈ నెల 10 నుంచి 19 వరకు రాజశ్యామల నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ విద్యార్థులతో ప్రత్యేక పూజలు, మహిళలతో కుంకుమార్చనలు, రాజశ్యామల యంత్ర పూజలు, హోమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులంతా పాల్గొనాలని కోరారు.

సచివాలయ ఉద్యోగులు అందుబాటులో ఉండాలి



జగనన్న ఇళ్ల పట్టాలను పరిశీలిస్తున్న కమిషనర్ అన్సారియా

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సచివాలయాల ఉద్యోగులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియా అన్నారు. నగరంలోని చంపాగల్లవీధి సచివాలయాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలించారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా స్నేహపూర్వకంగా ఉంటూ పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధులుగా పనిచేయాలని సూచించారు.

ధ్యానంతో విద్యార్థుల్లో ఏకాగ్రత



ధ్యానం పుస్తకాలతో విద్యార్థులు, పిరమిడ్ ప్రతినిధులు

ఎచ్చెర్ల క్యాంపస్: ధ్యానంతో ఏకాగ్రత పెరుగుతుందని శ్రీకాకుళంకు చెందిన పిరమిడ్ సంస్థ రిసోర్స్‌పర్సన్ బిందుమాధవి అన్నారు. ఎచ్చెర్లలోని శ్రీ వేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో మంగళవారం ధ్యాన విద్యార్థి కార్యక్రమం నిర్వహించి విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ధ్యానాన్ని జీవితంలో భాగంగా చేసుకోవాలన్నారు. ఒత్తిడి నుంచి రక్షణ పొందవచ్చన్నారు. ఉదయం, సాయంత్రం తప్పనిసరిగా ధ్యానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పిరమిడ్ ప్రతినిధి చిన్మయి, ప్రిన్సిపాల్ చిట్టిబాబు పాల్గొన్నారు.

ఢిల్లీలో కళాకారుల ప్రతిభ

శ్రీకాకుళం కల్చరల్ : పట్టణానికి చెందిన శ్రీసాయి శివ నృత్య కళానికేతన్ విద్యార్థులు ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల్లో ప్రదర్శన ఇచ్చారని నాట్యాచార్యులు ఎస్.హేమసాయి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రం తరఫున ప్రవేశపెట్టిన శకటం పక్కనే ప్రదర్శన ఇచ్చామని, అనంతరం మోదీ నివాసంలో జుగల్‌బందీ ప్రదర్శనలో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌పీఎల్ వాగ్దేవి, దువ్వారపు ధాత్రి, ఉరిటి రమ్య, శివల హర్షితా రాణి, బి.లిఖితశ్రీ, ఈడీఈ జిస్మృత, హర్షిత, దొడ్డి లాభిత, జ్యోతిక, శేష, ఆశ్రిత, లౌక్య, ప్రణవి, మామిడి ప్రసన్నలక్ష్మి, ఎర్రపు లక్ష్మీ వందన, మౌనిక, సంతోషి, దివ్య పాల్గొన్నారు.

కళాశాలకు కొత్త కళ

- కోకావారి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మహర్దశ
- రూ.1.95 కోట్లతో నూతన భవన సదుపాయం, మరుగుదొడ్ల సౌకర్యం
- టీడీపీ హయాంలో శిలా ఫలకంతో సరిపెట్టిన వైనం



ఇటీవల నిర్మించిన కళాశాల నూతన భవన సముదాయం



శిథిలావస్థకు చేరిన కాలేజీ భవనం(ఫైల్)



గార: మండలంలోని కె.మత్స్యలేశం పరిధిలోని కళింగపట్నం కోకావారి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మహర్దశ పట్టింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన నాడు–నేడు పథకంలో భాగంగా కాలేజీ రూపురేఖలను సమూలంగా మార్చేశారు. ఐదేళ్ల కిందట ఇదే కళాశాలలో అప్పటి టీడీపీ ఎమ్మెల్యే శిలాఫలకం ఏర్పాటు చేశారు. అయినా పనులు ప్రారంభం కాలేదు. నూతన ప్రభుత్వం వచ్చాక మంత్రి ధర్మాన ప్రసాదరావు చొరవ తీసుకుని పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించారు. ఏకంగా రూ. 1.95 కోట్లతో అదనపు భవన సముదాయాన్ని నిర్మించారు. గతంలో రెండు మాత్రమే మరుగుదొడ్లు ఉండగా ఇప్పుడు 14 టాయిలెట్లు నిర్మించారు.



నదిలో ప్లేట్లు కడుతున్న విద్యార్థులు (ఫైల్)

నాడు శిథిలావస్థలో కాలేజీ భవనం.. నాలుగు గదులున్న రేకుల షెడ్.. నేల, చెట్లు కింద చదువులు.. దుర్గంధంతో నిండిన రెండు మరుగుదొడ్లు, తాగునీరు, క్యారేజీలు కడిగేందుకు వంశధార నదికి వెళ్లాల్సిన దుస్థితి. ఇదీ గత ప్రభుత్వ హయాంలో 120 మంది విద్యార్థులున్న కె.మత్స్యలేశం పరిధిలోని కళింగపట్నం కోకావారి ప్రభుత్వ జూనియర్ కళాశాల దుస్థితి.



అత్యాధునిక మరుగుదొడ్లు

నేడు విద్యార్థులకు సరిపడా విశాలమైన తరగతి గదులు..గ్రూపుల వారీగా గదుల కేటాయింపు.. అత్యాధునిక మరుగుదొడ్లు.. పూర్తిస్థాయిలో అధ్యాపక బృందం .. ఇదీ సీఎం జగన్ పాలనలో వచ్చిన మార్పు. మంత్రి ధర్మాన చొరవతో కోకావారి ప్రభుత్వ జూనియర్ కళాశాల రూపురేఖలు మారడంతో ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 200కి చేరింది.

ఆనందంగా ఉంది..



కాలేజీ ఇలా మారుతుందని ఎప్పుడూ అనుకోలేదు. నా స్నేహితులు కొందరు 30 కిలోమీటర్ల దూరంలోని శ్రీకాకుళంలో ప్రైవేటు కళాశాలలో చదువుతున్నారు. వారు మా కాలేజీ వచ్చి చూసి చాలాబాగుంది ఇక్కడే ఉండిపోవాలని చెప్పినప్పుడు ఆనందంగా ఉంది.

– పుక్కళ్ల సుజాత, సీఈసీ సెకెండియర్, బందరువానిపేట

అధునాతన భవనాలు



రెండేళ్లలో రూ. 1.95 కోట్లతో కళాశాలలో భవనాలు నిర్మించడంతో వసతి సమస్య తగ్గుముఖం పట్టింది. మరుగుదొడ్లు అందుబాటులోకి వచ్చాయి. మంత్రి ధర్మాన ప్రసాదరావు దృష్టికి ఫర్నిచర్ సమస్య తీసుకెళ్లాం. త్వరలోనే సమకూరుతాయి.

– కె.అప్పలరాము, ప్రిన్సిపాల్

8 నుంచి న్యాయవాదులు కోర్టు విధుల బహిష్కరణ



మాట్లాడుతున్న బార్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భూ హక్కు చట్టం–2022కు వ్యతిరేకంగా ఈ నెల 8 నుంచి 16 వరకు న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరిస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు ప్రకటించారు. జిల్లా బార్ అసోసియేషన్ భవనంలో మంగళవారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విధుల బహిష్కరణ సమయంలో దావాలు, సెషన్స్ కేసులు, బెయిల్ తదితర వాటికి దూరంగా ఉండాలన్నారు. సమావేశంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పొన్నాడ రాము, ఉపాధ్యక్షులు గొంటి చంద్రమోహన్, బార్ కౌన్సిల్ సభ్యులు గేదెల వాసుదేవరావు, పాడి సీతంనాయుడు, కూన అన్నంనాయుడు, పొన్నాడ వెంకటరమణరావు, కూన రాజారావు, కొంక్యాన సుభాష్, నాగభూషణరావు, ఖగేంద్రనాథ్, సనపల హరి, వై.మురళీ మోహనరావు, భవానీ ప్రసాద్, ఆరికతోట కృష్ణంరాజు పాల్గొన్నారు.

వాణిజ్య పంటలకు ప్రకృతి వ్యవసాయమే మేలు



కమ్మసిగడాంలో అంతర పంటలను పరిశీలిస్తున్న ఒడిశా బృంద సభ్యులు

రణస్థలం: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వాణిజ్య పంటలు పండిస్తే రైతుకు ఎంతో లాభదాయకమని ప్రకృతి వ్యవసాయం అసిస్టెంట్ గోవింద రెడ్డి అన్నారు. రణస్థలం మండలం కమ్మసిగడాం, అర్జునవలస, బంటుపల్లి, కొండములగాం ప్రాంతాల్లో ఒడిశాకు చెందిన 50 మంది రైతుల బృందం క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలించారు. పామాయిల్ తోటల్లో అంతర పంటలైన బొప్పాయి, వంగ, టమాట, అరటి పంటల సాగు విధానంపై ఆరా తీశారు. పొలం గట్లపై పెసర, మినుము పంటలు వేస్తే కలుపు నివారణకు నత్రజనిగా ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రతి 15 రోజులకు ఒకసారి ఎకరాకు 200 లీటర్ల ద్రవ జీవామృతం పిచికారి చేస్తే బొప్పాయిలో వైరస్ తెగులు ఉండదన్నారు. ఆవు పేడ, మూత్రం, ఇంగువ ద్రావణంగా చేసి జీవామృతంగా తయారు చేసి పిచికారి చేయాలని సూచించారు. ఏటీఎం మోడల్‌లో పండించిన కూరగాయలు పరిశీలించారు. ఒడిశా బృంద సభ్యులు మాట్లాడుతూ ఏటీఎం మోడల్‌లో కూరగాయల పంటలు, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో వాణిజ్య పంటలు చక్కగా పండిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఒరియా ట్రాన్స్‌లేటర్ కృపానందం, మాస్టర్ ట్రైనర్ కంబపు కృష్ణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవినీతి

- సామాజిక తనిఖీల్లో బయటపడిన వైనం
- రికవరీకి అధికారుల ఆదేశం



సామాజిక తనిఖీ ప్రజావేదికలో అధికారులు

పలాస:

మండలంలోని వివిధ గ్రామాల్లో గత ఏడాది జరిగిన ఉపాధిహామీ పథకం పనుల్లో అవినీతి జరిగినట్టు అధికారులు గుర్తించారు. సామాజిక తనిఖీల్లో ఈ విషయం వెలుగుచూసింది. పలాస ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయ ఆవరణలో సోషల్ ఆడిట్‌ను మంగళవారం అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు సంబంధించిన పనులపై అంశాల వారీగా చర్చ జరిగింది. లొత్తూరులో రక్షణ గోడ నిర్మాణంలో అవకతవకలు జరిగాయని ప్రజావేదిక సోషల్ ఆడిట్ బృందం బయటపెట్టింది. ఇక్కడ పని చేసిన సిబ్బంది నుంచి రూ.1.30 లక్షలు రికవరీ చేయాలని డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు ఆదేశించారు. 19 పంచాయతీల్లో మస్టర్లపై సంతకాలు లేకుండా వేతనదారులకు బిల్లులు చెల్లించినట్టు గుర్తించామని స్టేట్ రిసోర్స్ పర్సన్ వెంకటరావు ప్రజావేదిక దృష్టికి తీసుకువచ్చారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.8.65 కోట్ల వ్యయంతో ఉపాధి హామీ పథకం ద్వారా చెరువులు, సీసీ రోడ్లు, కాలువలు, నీటి గుంటలు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు నిర్మాణాలు జరిగాయన్నారు. ఈ సందర్భంగా పీడీ చిట్టిరాజు మాట్లాడుతూ.. అర్హులందరికీ పనులు కల్పించాలని ఫీల్డు అసిస్టెంట్లను ఆదేశించారు. మస్టర్ల నిర్వహణ సక్రమంగా లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విజిలెన్స్ అధికారి డి.లవరాజు, క్వాలిటీ కంట్రోల్ సీనియర్ అధికారి సతీష్‌బాబు, ఏపీడీ శ్రీనివాసరావు, ఏపీవో శంకరరావు, ఈసీ విష్ణుమూర్తి పాల్గొన్నారు.

చిన్నారులకు ఉపాధ్యాయుల ఆర్థిక సాయం



చిన్నారులకు సాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఇచ్ఛాపురం రూరల్: తేలుకుంచి గ్రామానికి చెందిన మల్లవరపు వెంకటలక్ష్మి ఆత్మహత్య చేసుకోవడంతో 2, 4 తరగతులు చదువుతున్న పిల్లలు శరణ్య, లిఖితలు అనాథలుగా మిగిలిపోయారు. ఇటీవల 'సాక్షి'దినపత్రికలో 'అమ్మ లేదు..నాన్న రాడు' శీర్షికన కథనం ప్రచురించడంతో పలువురు దాతలు ముందుకు వచ్చి తమకు తోచిన ఆర్థిక సాయాన్ని అందిస్తున్నారు. మంగళవారం 2018 డీఎస్సీ తెలుగు పండిట్ సేవాదళ్ తరఫున చిన్నారులకు 7,100 రూపాయల నగదు, నిత్యావసర సరుకులు, దుస్తులను అందజేశారు. సాయం చేసిన వారిలో ఉపాధ్యాయులు జి.శంకరరెడ్డి, ఎల్లారావు, జి.కృష్ణ, శ్రీహరి, నాగిశెట్టి మల్యాద్రి, గేదెల శంకరరెడ్డి, ఆర్, కె.బాబు ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన వీఆర్‌ఓ సంఘ ప్రతినిధులు



కలెక్టర్‌ను సత్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మన్‌జిర్ జిలానీ సమూన్‌ను వీఆర్‌వో సంఘం జిల్లా అధ్యక్షుడు వంజరాపు రమేష్‌కుమార్, గౌరవాధ్యక్షుడు ప్రగడ వేణుగోపాలరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారెళ్ల అప్పలనాయుడు, సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

అంకితభావంతో పనిచేయాలి



మాట్లాడుతున్న తహశీల్దార్ రవి

జి.సిగడాం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విధి నిర్వహణలో అలత్వం వహిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ బి.రవి అన్నారు. మంగళవారం జి.సిగడాం రెవెన్యూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో డీటీ నిర్మల, ఆర్‌ఐ రామచంద్రరావు, వీఆర్‌ఓలు భూపతి నర్సింగరావు, పొట్నూరు జగన్, సీతయ్య, నీలకంఠం, ఎరకయ్య, సింహాచలం పాల్గొన్నారు.

సరస్వతీదేవి విగ్రహావిష్కరణ



సరస్వతీదేవి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంఈఓ రమణ

సారవకోట: కిడిమి ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం సరస్వతీదేవి విగ్రహాన్ని ఎంఈఓ ఎం.వి.రమణ ఆవిష్కరించారు. ఈ పాఠశాలలో 2016 నుంచి 2019 వరకు ఉపాధ్యాయుడిగా కూన వెంకటకృష్ణ విధులు నిర్వహించారు. ఈయన సరస్వతీదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా బల్ల పండగ

హిరమండలం: బల్ల పండగను స్థానిక దుర్గ రజక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. చెవిటమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పొంగళ్లతో హిరమండలం ప్రధాన రహదారిలో ఊరేగింపుగా వెళ్లి వంశధార నది ఒడ్డున బల్ల పండగ నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు రోణంకి రాము, సభ్యులు నరేష్, హరి, రామకృష్ణ, కొండ మల్లి తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ పొందిన అధ్యాపకులకు సత్కారం



సంతోష్‌కుమార్‌ను అభినందిస్తున్న శివానీ కళాశాల యాజమాన్యం

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కాలేజ్ ఫిజిక్స్ లెక్చరర్ బి.సంతోష్‌కుమార్ గోవా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాలలో మంగళవారం యాజమాన్య ప్రతినిధి దుర్గాప్రసాద్‌రాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు. ఉన్నత విద్యలో పరిశోధనలతో మంచి భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు.



మధును సన్మానిస్తున్న గురజాడ కళాశాల యాజమాన్యం

శ్రీకాకుళం రూరల్: మునసబుపేటలోని గురజాడ విద్యాసంస్థలో గాయత్రీ కళాశాలలో కామర్స్ విభాగం అధ్యాపకుడు ఎస్.మధుకు ఆంధ్రవిశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ లభించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం విద్యాసంస్థల అధినేత జి.వి.స్వామినాయుడు తదితరులు మధును అభినందించారు.

తెలగ కులస్తులు ఐక్యంగా పోరాడాలి



జి.సిగడాంలో వెంకటరమణకు స్వాగతం సంఘ నాయకులు

జి.సిగడాం/ఎచ్చెర్ల: బీసీ రిజర్వేషన్ సాధనకు తెలగ కులస్తులంతా ఐక్యంగా పోరాడాలని ఉత్తరాంధ్ర తెలగ సంక్షేమ సంఘం నాయకుడు పల్లంటి వెంకటరమణ(పీవీఆర్) పిలుపునిచ్చారు. మంగళవారం వాంగ్రంగి నుంచి సంతవురిటి వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్ఛాపురం నుంచి పాదయాత్రగా ప్రారంభమై జి.సిగడాం మండలంలో అడుగు పెట్టామన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బత్తుల సన్యాసిరావు, బాలబొమ్మ వెంకటేష్, చందనాల రంగారావు, పిల్లల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఈ యాత్ర ఎచ్చెర్ల చేరగా.. తెలగ సంఘం నాయకులు కంది శ్రీనివాసరావు నేతృత్వంలో పలువురు స్వాగతం పలికారు.

సమన్వయంతో పనిచేయాలి



ఎంపీడీఓ కృష్ణంరాజును సత్కరిస్తున్న కార్యదర్శులు, సిబ్బంది

జి.సిగడాం:

అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వర్తించాలని ఎండీడీఓ కె.కృష్ణంరాజు అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపర్చాలన్నారు. ఉపాధి పనుల నిర్వహణలో మండలం ప్రథమ స్థానంలో ఉండేలా పనిచేయాలన్నారు. అనంతరం ఎంపీడీఓను సత్కరించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి



వలంటీర్‌కు నియామక పత్రాన్ని అందిస్తున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా వలంటీర్లు పనిచేయాలని ఎంపీపీ మొదలవలస చిరంజీవి అన్నారు. ఎచ్చెర్ల మండలంలోని ఎస్ఎస్ఆర్‌పురం పంచాయతీ నందిగాం గ్రామానికి చెందిన లంగు అప్పలనాయుడుకు గ్రామ వలంటీర్‌గా నియామక పత్రాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ వలంటీర్లు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా ఉంటూ సంక్షేమ పథకాలు అర్హులకు చేరువ చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దుంప చిన్నారెడ్డి, నాయకులు కొంద్ర గోవిందరెడ్డి, వలంటీర్ చంటి పాల్గొన్నారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం



డాన్స్ చేస్తున్న విద్యార్థులు

కొత్తూరు: నివగాం ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలు పోటీల్లో గెలిపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్, రిటైర్డ్ హెచ్‌ఎం ఎద్దు గోపాలదాసు నాయుడు మాట్లాడారు. ఉత్తమ విద్యార్థులుగా ఎదగాలంటే క్రమశిక్షణ అవసరమన్నారు. పరీక్షలు సమీపిస్తున్నందున ప్రణాళికాబద్ధంగా చదవాలన్నారు. 2023 ఫలితాల్లో ప్రథమ సంవత్సరం సీఈసీ విద్యార్థిని ఎ.మీనా, ద్వితీయ సంవత్సరం బైపీసీ విద్యార్థిని మహాలక్ష్మికి కాలేజీలో అత్యధిక మార్కులు రావడంతో ఎద్దు సుందరనారాయణ వరహాలమ్మ ట్రస్టు చైర్మన్ గోపాదాసునాయుడు రూ.500 చొప్పున నగదు ప్రోత్సాహం అందజేశారు. కాలేజీకి అభివృద్ధికి విరాళాలు సేకరిస్తే తనవంతుగా కొంత మొత్తం ఇస్తానని ప్రకటించారు. కళాశాల అధ్యాపకుడు ఆదినారాయణ, మాజీ సర్పంచ్‌లు టి.వి.రమణారావు, నూలు వీరభద్రస్వామి, మీసాల సోమేశ్వరరావు, ఏజీపీ రాడ రాజు, రిటైర్డ్ ఉప తహసీల్దార్ గణేష్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఇళ్ల రిజిస్ట్రేషన్లు



కొత్తూరులో రిజిస్ట్రేషన్ చేస్తున్న వీఆర్వో, డిజిటల్ అసిస్టెంట్

కొత్తూరు: మండలంలోని 27 గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్న ఇళ్ల పట్టాలను గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. మండల వ్యాప్తంగా 748 ఇళ్ల పట్టాలకు ఇంతవరకు 235 పట్టాలకు రిజిస్ట్రేషన్లు జరిగాయి. వీఆర్వోలు, డిజిటల్ అసిస్టెంట్‌లు రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నారు. కొత్తూరు–1, 2, నివగాం గ్రామ సచివాలయాల్లో అధికంగా రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఇంతవరకు రాయల, ఇరపాడు, కల్లెమ్మ, దిమిలి, వసప, ఇరపాడు గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్‌లు ప్రారంభం కాలేదు.

108 వాహన సేవలపై ఆరా

పాతపట్నం/మెళియాపుట్టి: ప్రభుత్వ నిబంధనల ప్రకారం 108 వాహనంలో మందులు, పరికరాలు ఉండాలని, ఆక్సిజన్ ఎప్పటికప్పుడు నిల్వ ఉంచాలని పలాస డివిజన్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ అధికారి జగన్నాథరావు అన్నారు. పాతపట్నం మండల కేంద్రంలోని సీహెచ్‌సీ ఆస్పత్రి ఆవరణలో ఉన్న 108, మెళియాపుట్టి మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వద్ద ఉన్న 108 వాహనాలను మంగళవారం తనిఖీ చేశారు. వాహనాల పనితీరును పరిశీలించారు. రికార్డుల నిర్వహణ, విధులు సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఫోన్ వచ్చిన వెంటనే స్పందించాలన్నారు. పాతపట్నం మెడికల్ టెక్నీషియన్ కె.ఆఫీస్, పైలెట్ గోపాలకృష్ణ, మెళియాపుట్టి మెడికల్ టెక్నీషియన్ సరోజిని, పైలట్ రాంబాబు ఉన్నారు.